క్లుప్తంగా

200 మందికి వైద్యపరీక్షలు

వీరులపాడు: మండలంలోని జుజ్జూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో జేసీబీఎం ఫాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కంచికచర్ల కారుణ్య ఎమర్జెన్సీ జనరల్ హాస్పిటల్ సౌజన్యంతో మొత్తం 200 మందికి వైద్యపరీక్షలు చేశారు. 2డీ ఎకో, ఈసీజీ, బీపీ, షుగర్, కంటి, గుండె సంబంధిత పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యులు మొండ్రు సురేష్‌బాబు, కోలా శేఖర్, హెచ్‌సీజీ క్యాన్సర్ టీం సభ్యులు, పాస్టర్లు ప్రభాకర్, శామ్యూల్ పాల్గొన్నారు.

సూర్యోపాసన సర్వవిధాల శ్రేయస్కరం



విజయవాడకల్చరల్: సూర్యారాధన, సూర్యోపాసన సర్వవిధాల శ్రేయస్కరమని లబ్బీపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వాహకుడు డాక్టర్ రామ్మోహనరావు అన్నారు. కంచి కామకోటి పీఠస్థ శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం సూర్య నమస్కారాలు, అరుణ పారాయణం కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ రామ్మోహనరావు మాట్లాడుతూ.. సూర్య భగవానుడు ప్రత్యక్ష దైవంగా భక్తులు విశ్వసిస్తారన్నారు. సూర్యభగవానుని ఆరాధించే సంస్కృతి భారతీయ సనాతన ధర్మంలో ఉందని చెప్పారు. భారతీయులు పవిత్రంగా భావించే పండుగలన్నీ సూర్యమానంతోనే ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమాన్ని మేనేజర్ శర్మ నిర్వహించారు. రుత్వికులు అరుణ పారాయణం చేశారు.

గాయని శ్రీదేవికి సుస్వరగాన ప్రవీణ బిరుదు ప్రదానం



విజయవాడకల్చరల్: తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, కామ్రేడ్ జీఆర్కే పోలవరపు సాహితీ సమితి, స్వరఝరి కల్చరల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై గాయనీ గాయకులు ఆపాత మధురాల పేరుతో పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. ఒంగోలుకు చెందిన గాయనీ గాయకులు అంజిబాబు, చరణ్‌రాజ్, అంజుస్వామి, స్వామి, వై.ఏసుబాబులు గీతాలను ఆలపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ గాయనీ గాయకులలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. గాయని శ్రీదేవికి సుస్వరగాన ప్రవీణ బిరుదుతో సత్కరించారు. వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు కె.డేవిడ్‌రాజు, బోడి ఆంజనేయరాజు, సింగంశెట్టి చంద్రశేఖర్, గోళ్ల నారాయణరావు, డాక్టర్ కమ్ముల రవిశేషుకుమార్, బీవీ వీరభద్రరావు గాయని శ్రీదేవిని అభినందించారు.

రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



మైలవరం: మైలవరం శ్రీ రాజా ఎస్వీఆర్జీఏన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కృష్ణా జిల్లా ఫుట్‌బాల్ టీమ్‌కు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.సతీష్ ఆదివారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయిలో జరుగనున్న పోటీలకు గన్నవరంలో జరిగిన సెలక్షన్‌లో తమ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు మాధవరపు కౌశిక్, పెనుమూడి శ్యాంకుమార్, 9వ తరగతి విద్యార్థి ప్రత్తిపాటి గౌతం ఎంపికయ్యారన్నారు. కడపలో త్వరలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల దాతలు ఎస్వీ సుధాకరరావు, ఎస్వీ నివృతరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.సతీష్, పీడీ శాంతికుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

వైభవంగా శ్రీసత్యసాయి బాబా పల్లకీ సేవ

జి.కొండూరు: ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం సున్నంపాడు గ్రామంలో పుట్టపర్తి సత్య సాయిబాబా వారి శత జయంతి వేడుకలను ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పల్లకీ సేవను భక్తులు పెద్ద ఎత్తున నిర్వహించారు. విజయవాడ పట్టణంలోని శ్రీ సత్యసాయి సేవా సమితి, సీతారామపురం వారి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. శ్రీసత్యసాయిబాబా మందిరం అయిన పుట్టపర్తి నుంచి నిర్వాహకులు శ్రీ సాయిబాబా వారి పాదుకలు తీసుకువచ్చి సున్నంపాడు గ్రామంలో ఊరేగించారు. అనంతరం దివ్యాంగులు, వృద్ధులు 23 మందికి నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. పదాధికారులు, సేవాదళ్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కూటమి కుట్రలను తిప్పికొట్టాలి

తన్నీరు నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు

వత్సవాయి: పేదలకు వైద్యవిద్యను, వైద్యాన్ని దూరం చేసేలా సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రజాస్వామ్యవాదులంతా తిప్పికొట్టాలని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ వత్సవాయిలోని వాసవీ కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గుత్తా శంకరరావు ఆధ్వర్యంలో ఆదివారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ఉన్నతాశయంతో రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టి, వాటిలో ఐదుకళాశాలను తానే స్వయంగా ప్రారంభించారన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వహయాంలో మరో రెండు కళాశాలల పనులు తుదిదశగా చేరుకోగా, మిగిలిన కళాశాలల పనులు వివిధ స్థాయిలో ఉన్నాయని గుర్తుచేశారు. ఏడాదిన్నర కిందట అధికారంలోనికి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిపై ఆ కళాశాలల్లో మిగిలిన పనులను పూర్తిచేయకుండా వాటిని ప్రైవేటుపరం చేసేందుకు పీపీపీ విధానం తీసుకొచ్చిందన్నారు. దీంతో రాష్ట్రంలోని పేదలకు వైద్యం దూరం కావడంతోపాటు వైద్య విద్య అందని ద్రాక్షగా మారుతుందన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయాలని చూడడం సిగ్గుచేటన్నారు. మెడికల్ కళాశాలలు పూర్తయితే మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరు వస్తుందనే అక్కసుతోనే కూటమి పాలకులు వాటిని ప్రైవేటుపరం చేస్తూ రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శిస్తున్నారు. పీపీపీ విధానాన్ని రద్దుచేసి ప్రభుత్వమే మెడికల్ కళాశాలల నిర్మాణాన్ని పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణకు పార్టీ తరఫున చేసే పోరాటంలో మేధావులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు ఆళ్ల చెల్లారావు, రాష్ట్ర ఎంపీపీల సంఘ అధ్యక్షులు మార్కపూడి గాంధీ, వత్సవాయి ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, వైస్ ఎంపీపీ కొలికపోగు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి చిన్నా, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి కాటేపల్లి రవి, బీసీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బత్తుల రామారావు, న్యాయవాదుల సంఘ నాయకుడు పసుపులేటి సత్య శ్రీనివాస్, గ్రామ పార్టీ అధ్యక్షులు మిట్టకోలు నరేష్, రైతు విభాగం జిల్లా, నియోజకవర్గ అధ్యక్షులు ఏలూరి శివాజీ, కనగాల రమేష్, చిరుమామిళ్ల శ్రీను, జిల్లా పార్టీ నాయకులు చింతకుంట్ల వెంకటరెడ్డి, వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, రూప్లానాయక్, కుక్కల శ్రీధర్, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు నరమనేని వెంకటేష్, భారీసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొన్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దాలి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విప్ తంగిరాల సౌమ్య

కంచికచర్ల: విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులేనని ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సూచించారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని కంచికచర్ల మిక్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (డెమోక్రటిక్) నందిగామ డివిజన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి విశిష్ట విద్యాసేవా పురస్కార వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తిని గౌరవించి, వారి సేవలను అభినందించడం కోసం ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవం జరుపుకుంటున్నట్లు వివరించారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి పురోభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. నందిగామ డివిజన్ వివిధ మండలాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కంచికచర్ల ఏఎంసీ చైర్మన్ కోగంటి బాబు, ఆయా మండలాల ఎంఈఓలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై పోరుబాట

కంచికచర్ల: నకిలీ మద్యం తయారుచేసి విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల వైఎస్సార్ సీపీ కంచికచర్ల పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్ బాబు ఆదివార ఒక ప్రకటనలో తెలిపారు. నకిలీ మద్యం కేసులోని నిందితులను వెంటనే శిక్షించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం తొమ్మిదిగంటలకు జుజ్జూరు సెంటర్ నుంచి బయలుదేరి ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఎక్సైజ్‌శాఖ అధికారులకు మెమొరాండం ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమానికి నందిగామ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ హాజరుకావాలని సురేష్‌బాబు కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

జగ్గయ్యపేటఅర్బన్: అనారోగ్యానికి గురైన పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ఆదివారం తన నివాసంలో పంపిణీ చేశారు. వత్సవాయి మండలం, భీమవరం గ్రామానికి చెందిన గోడితాల మమతకు రూ. 67,378, సంగెపు లక్ష్మణకు రూ 25,166 చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

నేడు పేట ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నకిలీ మద్యంపై నిరసన వ్యక్తంచేయనున్నట్లు ఆ పార్టీ జగ్గయ్యపేట పట్టణ, పేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల అధ్యక్షులు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, బూడిద నరసింహారావు, పొన్నం కోటేశ్వరరావు, గుత్తా శంకరరావు ఆదివారం తెలిపారు. రాష్ట్రంలో ప్రజల ప్రాణాలు తీస్తున్న ఎన్ బ్రాండ్ నకిలీ మద్యాన్ని అరికట్టాలని నిరసిస్తూ సోమవారం ఉదయం 10 గంటలకు జగ్గయ్యపేట పట్టణంలోని తొర్రగుంటపాలెంలో ఉన్న ఎక్సైజ్ కార్యాలయం వద్ద పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. తొమ్మిదిన్నర గంటలకు పార్టీ కార్యాలయంలో నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరుకావాలని వారు కోరారు.

15 మంది జూదరుల అరెస్టు

విస్సన్నపేట: పేకాట శిబిరాలపై ఆదివారం పోలీసులు దాడిచేసి 15 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ జి. రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పుట్రేల గ్రామ పంచాయతీ కోటిపల్లి గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3,710 నగదు, 6 బైకులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే పుట్రేల గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3,120 నగదు, ఐదు బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామాల్లో జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అధ్వానంగా ముచ్చింతాల-తాళ్లూరు రోడ్డు



ముచ్చింతాలలో బురదమయమై అధ్వానంగా ఉన్న రోడ్డు



వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్డు

ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): మండలంలోని ముచ్చింతాల నుంచి వత్సవాయి మండలం తాళ్లూరు వరకు గల రహదారి అత్యంత ప్రమాదకరంగా మారింది. సుమారు ఐదు కిలోమీటర్ల మేర ఉన్న ఈ రోడ్డుకు వర్షాలు, వరదల కారణంగా పెద్దపెద్ద గోతులుపడ్డాయి. తారు కొట్టుకుపోవడంతో ఈరోడ్డులో ప్రయాణించాలంటే జనం హడలిపోతున్నారు. ముఖ్యంగా ఈ రోడ్డు ఆంధ్రా-తెలంగాణా రాకపోకలకు ప్రధానమైన రోడ్డు కావడంతో నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. అదేవిధంగా పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి వచ్చేందుకు సైతం భక్తులు ఈ రోడ్డులోనే ప్రయాణించాల్సి ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ రోడ్డుకు అభివృద్ధికి పాలకులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు.



వరదకు దెబ్బతిన్న వాగు కల్వర్టు



ముచ్చింతాల పెద్దకాలువ వద్ద రోడ్డు పరిస్థితి ఇది

మానవ జీవితంలో మానసిక ఆరోగ్యం ముఖ్యమే



మానసిక ఆరోగ్యంపై జరిగిన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ఆర్కే అయోధ్య

లబ్బీపేట(విజయవాడతూర్పు): మానవ జీవితంలో శారీరక ఆరోగ్యం ఎంత ముఖ్యమో, మానసిక ఆరోగ్యం అంతే ముఖ్యమని ప్రముఖ మానసిక వైద్యుడు ఆర్కే అయోధ్య అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా మానసిక ఆరోగ్యం - రోజువారీ జీవితంలో దాని ప్రాముఖ్యత అనే అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. మహాత్మాగాంధీరోడ్డులోని ఓ హోటల్‌లో నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ అయోధ్య మాట్లాడుతూ.. ప్రతి వంద మందిలో 15 నుంచి 20 మంది మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారన్నారు. మూఢనమ్మకాలతో వాళ్ల అమూల్యమైన జీవితం పాడు చేయవద్దని, మానసిక వైద్యుడిని సంప్రదించడానికి సంకోచించకూడదన్నారు.

యోగా, మెడిటేషన్ చేయాలి..

శాస్త్రీయమైన వైద్య విధానమే ఉత్తమమని డాక్టర్ అయోధ్య సూచించారు. యాంగ్జైటీ, డిప్రెషన్, ఫోబియోలతో పాటు మత్తు పదార్థాలు, మద్యపానం, గుట్కా, ధూమపానం వంటి వాటికి బానిసలు అవడం కూడా మానసిక సమస్యలుగా గుర్తించాలన్నారు. ఆత్మహత్యలు, హత్యలు కూడా మానసిక ఉన్మాద చర్యలుగానే భావించాలని చెప్పారు. ప్రశాంత జీవన విధానం, వ్యాయామం, యోగా, మెడిటేషన్, చక్కటి ఆహారపు అలవాట్లు, రోజుకు 8 గంటల నిద్ర, వివాదాలకు దూరంగా ఉండటం, సంతృప్తికరమైన జీవితం వంటి దినచర్యల ద్వారా మానసిక ప్రశాంతత, ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు. సదస్సుకు రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్షుడు చారుగుళ్ల రమేష్ అధ్యక్షత వహించగా, కార్యదర్శి ఉదయ్‌కుమార్, పెద్ద సంఖ్యలో రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

టూ వీలర్స్ మెకానిక్ వర్కర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

పటమట(విజయవాడతూర్పు): ది విజయవాడ టూ వీలర్స్ మెకానిక్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. పటమట హైస్కూలు రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన ఈ ఎన్నికలో గౌరవ అధ్యక్షుడిగా ఫిరోజ్, అధ్యక్షుడు ఆంజనేయదాసు, ఉపాధ్యక్షుడు వెంకటరమణ, కార్యదర్శిగా జానీని సభ్యులు ఎన్నుకున్నారు. కోశాధికారిగా ఇర్ఫాన్ బేగ్‌తో పాటు నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

విజయకుమార్ కవిత్వం సామాజిక అంశాల సమాహారం

విజయవాడకల్చరల్: విజయకుమార్ కవిత్వం సామాజిక అంశాల సమాహారమని విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు అన్నారు. ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ ఆధ్వర్యంలో యువ కవి కారంచేటి విజయకుమార్ రచించిన కవితా సంపుటి కలువల కొలను కవితా సంపుటి ఆవిష్కరణ సభను విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ.. కవులకు సమాజమే కవితా వస్తువు అన్నారు. సమాజంలో నేడు జరుగుతున్న అనేక అంశాలకు కవి విజయకుమార్ అక్షర రూపం దాల్చారని తెలిపారు. కవిత్వంలో, సాహిత్యంలో సామాజిక చిత్రీకరణ ఉండాలన్నారు. కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. కవులు సమాజంలో వస్తున్న మార్పులను గమనించాలని సూచించారు. కవి విమర్శకుడు రామకవచం సాగర్ కవితా సంపుటిని ఆవిష్కరించారు. కవితా సంపుటి రచయిత విజయకుమార్ తనకు ప్రేరణ కలిగించిన అంశాలను తెలిపారు. కార్యక్రమాన్ని ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ కార్యనిర్వాహక కార్యదర్శి కందికొండ రవికిరణ్, కోశాధికారి సీహెచ్‌వీ సుబ్బయ్య నిర్వహించారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



క్యూలైన్‌లో భక్తుల రద్దీ

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం చుట్టూ నిర్వహించిన అమ్మవారి రథోత్సవం కనులపండువగా సాగింది. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలో వాహనాల రద్దీ కొనసాగింది.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

స్విమ్మర్ల విజయాలు స్ఫూర్తిదాయకం



పతక విజేతలతో ఎమ్మెల్యే తాతయ్య దంపతులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట స్విమ్మర్ల వరుస విజయాలు అందరికీ స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) కొనియాడారు. మాస్టర్స్ ఆక్వాటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 10 వ తేదీన గుంటూరు మున్సిపల్ స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహించిన 8వ స్టేట్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జగ్గయ్యపేట డ్రీమర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్‌కు చెందిన 19మంది పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పతక విజేతలు, కోచ్‌లు పొట్టాబత్తిన పాండురంగారావు, లక్ష్మి, సందీప్, టీం మేనేజర్ అన్నంనీడి కల్యాణ్‌లను ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య దంపతులు ఆదివారం ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జగ్గయ్యపేట స్విమ్మర్లు అసోసియేషన్ ఏర్పాటు చేసి పలువురికి స్విమ్మింగ్‌లో శిక్షణ ఇవ్వడమే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో కూడా అనేక పతకాలు సాధించడం జగ్గయ్యపేటకే కాకుండా జిల్లాకే గర్వకారణమన్నారు. ప్రభుత్వం తరఫున క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మందడపు శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ కలాలి నరేష్, కోకన్వీనర్ యలదండి శ్రీనివాస్, తుమ్మడపు నారాయణ, భోగిరెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా గ్రామసంత కాంప్లెక్స్



నిరుపయోగంగా దర్శనమిస్తున్న గ్రామసంత కాంప్లెక్స్



శిథిలావస్థకు చేరిన చెత్తసేకరణ ఆటోలు

నందిగామరూరల్: మండలంలోని లింగాలపాడులో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామ సంత కాంప్లెక్స్ నిరుపయోగంగా మారింది. గ్రామంలోని రహదారుల వెంబడి తాత్కాలిక దుకాణాల్లో వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులకు గ్రామ సంత కాంప్లెక్స్‌లో దుకాణాలను కేటాయించారు. అయితే కాంప్లెక్స్ గ్రామ సెంటరుకు దూరంగా ఉండటంతో సంత కాంప్లెక్స్‌లో వ్యాపారాలు సాగించేందుకు చిరువ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఈ దుకాణాలు నిరుపయోగంగా మారాయి. ఏళ్ల తరబడి గ్రామ సంత కాంప్లెక్స్ ఖాళీగా దర్శనమిస్తుండటంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

పిచ్చి చెట్లతో దర్శనమిస్తున్న ఆవరణ..

గ్రామ కాంప్లెక్స్ సంత ఆవరణ అంతా పిచ్చి, కంప చెట్లతో దర్శనమిస్తుంది. ఎలక్ట్రిక్ ఆటోలు, చెత్తతో సంత ఆవరణ చిన్నపాటి డంపింగ్ యార్డును తలపిస్తోంది. గ్రామ పంచాయతీ పరిధిలో తడి, పొడి చెత్త సేకరణకు వినియోగించే ఆటోలు సైతం ఎండకు ఎండి, వానకు తడిచి తుప్పుపడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సంత కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తెచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రావి కృష్ణారావు సేవలు నిరుపమానం



రావి కృష్ణారావును సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడిగా ఎన్నికైన రావి కృష్ణారావు సేవలు నిరుపమానమని పలువురు వక్తలు కొనియాడారు. ఏలూరు రోడ్డులో ఆదివారం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన ఫాస్ట్ గవర్నర్ చిన్న రామకృష్ణ అధ్యక్షతన రావి కృష్ణారావు సత్కారం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ అధ్యక్షులు డాక్టర్ ఎంవీ రావు, మురళీ మోహన్, పాస్ట్ గవర్నర్‌లు ఎంఆర్‌ఎస్ ప్రకాశరావు, గంగాధర్, ఎలెక్ట్ గవర్నర్ కె.శ్రీనివాస్ రాజు, నగరానికి చెందిన పలు వాకర్స్ అసోసియేషన్ క్లబ్‌ల ప్రతినిధులు రావి కృష్ణారావును ఘనంగా సత్కరించారు. అనంతరం ఆర్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన చిన్నం రామకృష్ణను అభినందించారు. ఈ సందర్భంగా రావి కృష్ణారావు మాట్లాడుతూ తన విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో వాకర్స్ క్లబ్‌ల ద్వారా సేవా కార్యక్రమాలను విస్తృతంగా చేసి బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా వాకర్స్ నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో అన్నదానం

ఇబ్రహీంపట్నం: గ్యార్వీ పండుగ సందర్భంగా పశ్చిమ ఇబ్రహీంపట్నం మసీదు వద్ద ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సూఫీ మత గురువులు అల్తాఫ్ రజా ముఖ్యఅతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా గౌసే ఆజం చిహ్నమైన జెండా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సర్వమానవాళికి శాంతి మార్గం సూచించిన మహమ్మద్ ప్రవక్తముని మనవడు మహబూబ్ సుభాని జ్ఞాపకార్థం గ్యార్వీ పండగ నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ ముస్తఫా, ఉపాధ్యక్షులు షేక్ సర్వర్ సాహెబ్ కరీముల్లా, అలీఫ్ ఖాన్, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.